


ఎండ... భయంకరమైన ఎండ... రోళ్ళను రోకళ్ళను పగుల గొడ్తున్న రోహిణికార్తె ఎండ... ప్రపంచాన్నంతా నాపాం బాంబులా మాడ్చి మసిచేస్తున్న ఎండ... సమస్త ప్రాణకోటిని పెనంమీద వేయిస్తున్న ఎండ... కసిగా ఎండ... క్రూరంగా ఎండ కర్కశంగా ఎండ.

ఎండ తాచుపాములా బుసకొడ్తోంది.

కొండ చిలువలా ఆవులిస్తోంది.

పెద్దపులిలా గర్జిస్తోంది.

కార్చిచ్చులా వ్యాపిస్తోంది.

ఆ ఎండలో కూర్చొని రంగమ్మ కంకర రాళ్ళను పగులగొడ్తోంది. ఆమెతో పాటు అక్కడ ఇంకో పదిహేనుమంది దాకా ఆడవాళ్ళు పనిచేస్తున్నారు. పెద్ద పెద్ద రాళ్ళను తమ చేతుల్లో ఉన్న సుత్తెలతో చిన్నచిన్న కంకరరాళ్ళుగా పగుల గొడ్తున్నారు. వాళ్ళ సుత్తెల ధ్వనులు ఒక క్రమమైన పద్ధతిలో

మ్రోగుతూ ఒక వింత సంగీతాన్ని సృష్టి స్తున్నాయి.

అక్కడికి కొంచెం దూరంలో నలభై మంది దాకా మగవాళ్ళు పనిచేస్తున్నారు. వాళ్ళు అక్కడొక బ్రిడ్జిని కట్టే కార్య క్రమంలో నిమగ్నులై ఉన్నారు. కింద ఓ చిన్న నది. ఆ నదిలో మరో ముప్పయిమంది దాకా ఆడవాళ్ళు మగ వాళ్ళు నదిలోని ఇసికను ఓ లారీలోకి ఎత్తుతున్నారు. పనులన్నీ చకచకా జరిగిపోతున్నాయి. అంత భయంకరమైన ఎండ వాళ్ళమీద తన ప్రభావాన్ని చూపించలేక పోతున్నది. వాళ్ళంతా చెమటలు కారుతున్న అర్థనగ్న శరీరా లతో .. అచంచలమైన దీక్షతో ఆ బ్రిడ్జిని కట్టే పనిలో మునిగి ఉన్నారు. వాళ్ళతోపాటే కొంచెం దూరంలో గొడుగులు పట్టుకొని వాళ్ళకు ఆజ్ఞలు పురమాయిస్తున్నారు ఇద్దరు మేస్త్రీలు.

అక్కడ పనిచేస్తున్న వాళ్ళంతా వడ్డెరవాళ్ళు. బ్రిడ్జికి కొంచెం దూరం లోనే వాళ్ళ గుడిసెలున్నాయి. ఆ బ్రిడ్జి కట్టటం పూర్తికాగానే వాళ్ళు అక్క ణ్ణించి వెళ్ళిపోతారు మళ్ళీ ఎక్కడ పని దొరికితే అక్కడ గుడిసెలు వేసు కుంటారు వాళ్ళకొక స్థిరమైన ఇల్లు వాకిలీ అంటూ లేవు. ఆస్తిపాస్తులంటూ లేవు స్వంత ఊరు, రాష్ట్రం, ప్రాంతం అంటూ లేవు వాళ్ళకు భారతదేశంలో అన్నింటికంటె పవిత్రమైన ఓటు కూడా ఉందో లేదో చెప్పలేం వాళ్ళకు ఈ దేశాన్ని పాలిస్తున్న దెవరో తెలియదు. వాళ్ళకు తెలిసిందల్లా ఒక్కటే- ఎండా, వాన, చలి మొదలైన ప్రకృతి శక్తులకు అతీతంగా రెక్కలు విరుచుకుని పని చేస్తేనే వాళ్ళ పొట్ట గడుస్తుందని! వాళ్ళ పరిస్థితి మొదటి పంచవర్ష ప్రణా ళికలో ఎలా ఉందో నాల్గో పంచవర్ష ప్రణాళిక పూర్తయ్యేనాటికి కూడా అలాగే ఉంది.

రంగమ్మ ఆమె నంతా 'రంగి' అంటారు రంగికి ఇరవై యేళ్ళుంటాయి. కానీ నలభై యేళ్ళు దాటినట్టుగా కనిపి స్తుంది. ఇరవై యేళ్ళ ప్రాయంలో సహ జంగా ఓ స్త్రీలో ఉండే నిగనిగలు గానీ, మిసమిసలుగానీ రంగిలో బొత్తిగా లేవు. రంగి నెలరోజుల క్రితమే మూడో సారి ప్రసూతయ్యింది. ఇద్దరూ లేక ముగ్గురు అనే నినాదం వాళ్ళదాకా వెళ్ళినట్లు లేదు. వాళ్ళకు ఎంతమంది పిల్లలుంటే అంత సంపాదన అనే నమ్మకం. నాలుగైదు ఏళ్ళు దాటగానే వాళ్ళ పిల్లల చేత అదో ఇదో కూలి పని చేయించి కొంచెం సంపాదించుకో వచ్చునని వాళ్ళ ఆశ.

రంగి మొగుడు వీరయ్య. అతన్నంతా ఈరిగాడంటారు. ఈరిగాడికి ఇరవై ఎనిమిది యేళ్ళుంటాయి. వాడిప్పుడు అక్కడే బ్రిడ్జిమీద పనిచేస్తున్నాడు. వాడే ఈ రోజు రంగిని బలవంతంగా పన్లోకి తీసుకువచ్చాడు. నిజానికి రంగి యేనాడూ పనికి జంకలేదు మొదటి రెండు కానుపులప్పుడు పదిరోజులు తిర క్కుండానే పన్లో కొచ్చింది. కానీ ఈసారి రంగికి వంట్లో యేమాత్రం కూడా బాగులేదు. బొత్తిగా సత్తువ లేనట్టుగా అనిపించింది. యేదన్నా మందూ మాకూ తింటే బావుండు ననిపించింది. వాళ్ళ

ల్లోనే ఓ వైద్యుడున్నాడు అతడే ఏదో చెట్లమందు పోశాడు. అయినా రంగి శరీరం బాగుపడలేదు.

ఈరిగాడి సంపాదనలో సగానికంటె ఎక్కువగా వాడు తాగే కల్లుకే ఖర్చయి పోతున్నది. పిల్లలూ, తనూ ఓ పూటా పస్తుండాల్సి వస్తున్నది తను కూడా పన్లోకి వెడ్తే తనకూ రోజూ ఓ రెండు రూపాయల దాకా వచ్చేవి. తన పిల్లలకు రెండు పూటలూ తిండిపెట్టగల్గేది. తను కూడా సరిగ్గా తినక, వంట్లో బాగాలేక చంటిదానికి బొత్తిగా పాలు దొరకటం లేదు. అది యేడ్చి యేడ్చి సొమ్మసిల్లి పోతోంది. ఎలాగైనా సరే తనుకూడా మిగతా అందరి ఆడవాళ్ళతోపాటు బ్రిడ్జి కాడికి పనిచెయ్యటానికి వెడ్తే బావుండు నని రంగి ఎంతగానో అనుకొంది కాని తన శరీరం తన చేతుల్లో లేదు. తనేం చేస్తుంది?

ఈ రోజు ఈరిగాడు భార్యను కసి రాడు.

“గిట్ల ఎన్నాళ్ళు పంటవే . దుని యాల నువ్వే నీళ్ళాడినవా . ఎంత సుఖేసి పానమైపోయెనేమె . మనం మారాజులంగాదు పంటే యెళ్ళటానికి. లేలే .. ఇయ్యాళ అముత్తి, రామితో బ్రిడ్జికాడిరా.”

“వంట్లె బలంలేదు . లేత్తే పడి పోయెటట్టున్న ఎట్ట రానయ్యా’ అంది రంగి జాలిగా.

“గిట్ల మాట్లాడితే వళ్ళు మండ్తది పంటుంటె పండ బుద్దయితది. లేసి పని చేత్తాంటె చాతనయితది. పోరగొండ్లకింత బువ్వ పెట్టి నువ్వింత తాగిరా . నే పోతానా... మల్ల ఇయ్యాళగిన తప్పించినవో చంపేత్త...” అంటూ ఈరిగాడు వెళ్ళిపోయాడు

రంగికి చాలా రోషం వచ్చింది యేడు పొచ్చింది. తనమీద తనకు జాలేసింది. తను యేనాడూ పనికి భయపడలేదు. కొంచెం చేతనయినా సరే వెళ్ళింది. కానీ ఈసారి కానుపొచ్చాక నెలరోజుల దాకా పనికి రాకపోయేసరికి ఈరిగాడికి తనమీద అసహ్యం వేస్తోంది తనను ఎందుకూ పనికి రానిదనుకుంటున్నాడు. చంపేత్తాడంట .. రంగి పిచ్చిగా నవ్వు కుంది. ఈరిగాడంత జాలిలేని వాడేం కాదు ఆడికి తనమీద కొంచెం ‘ఇది’ కూడా ఉంది. కానీ పాపం ఆడేం జేత్తడు. బొత్తిగా రోజు గడ్వటంలేదు. ఈమద్దె ఆడికి కడుపునిండా కల్లు దొరకటం లేదు. ఆడు కల్లు లేకుండా బతకలేడు. రోజంతా ఎర్రటి ఎండలో రెక్కలు ఇరుచుకుని పనిజేత్తడు . పొద్దుగూకేసరికి కడుపునిండా కల్లు తాగి గుర్రెట్టి నిద్రపోతడు.

చంటిపిల్ల గుక్కపెట్టి యేడ్వసాగింది. రంగి లేచి రొమ్ము నోట్లో పెట్టింది. కానీ తన రొమ్ముల్లో పాలు లేవని రంగికి తెలుసు. చంటిపిల్ల కాస్సేపు యేడుపు మానేసింది. పెద్దాడు తండ్రితోనే బ్రిడ్జి కాడికి పోయినట్టున్నాడు రెండోడు బయట ఆడుకుంటున్నాడు చంటిదాన్ని పడుకోబెట్టి రంగి లేచింది. ఇయ్యాళ పనికి పోకపోతే ఆడూరుకోడు. చచ్చి పోతనా పోతె . ఓ రెండు రూపాయ లొస్తాయి.

‘రామిగా’ అని కేకేసింది రంగి.

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మ్‌స్టార్!

**ఎంతటి వాళ్ళకూ తప్పదు విధిప్రేరణ**
**హీరోగావచ్చి కృష్ణంరాజు చేయవల్సి**
**వచ్చింది దుష్టపాత్ర ధారణ**
**అంతమాత్రంచేత పొందలేదతను**
**డిసప్పాయింట్‌మెంట్**
**పైమకోసం ఎదురు చూడటంలోనే**
**అయ్యాడెంతో బ్రిలియంట్.**

**—జి. యన్. సూరి**



బయట్నించి ఓ మూడేళ్ళ కుర్రాడొచ్చాడు. వాడి శరీరంమీద గుడ్డ పేలికలు కూడా లేవు. 'యేందే' అంటూ వాడు లోపలకొచ్చాడు.

"బువ్వ బెడ్త రారా... ఇయ్యాళ నే బిడ్జికాడి పోత. నువ్వు చెల్లెను సూత్తుండాలి... అది యేడ్తిగిన నాకొచ్చి చెప్పు..."

వాడు అలాగే నన్నట్టు తలూపాడు.

అక్కడే ఓ మూలనున్న కుండల్లోని ఓ కుండను తీసి దాంట్లో ఉన్న జొన్న గడకను రెండు చిప్పల్లో పెట్టింది రంగి. వాటిల్లో పక్కనే ఉన్న మరో కుండలోని మంచినీళ్ళను పోసి కలిపింది. ఒకటి తను తీసుకొని మరొకటి ఆ కుర్రాడికిచ్చింది.వాడు రెండు గుక్కల్లో ఆ గడక తాగేశాడు. రంగి ఆగడక తాగటానికి ప్రయత్నించింది. కాని ఒక్క గుక్క కూడా తాగలేకపోయింది. కడుపులో యేదో వికారం... బలవంతంగా తాగితే డోకొచ్చినట్టయ్యింది. లాభం లేదనుకొని తన చిప్పకూడా కొడుకిచ్చేసి తాగమంది. వాడు అది కూడా ఒక్క గుక్కలో తాగేసి బయట కెళ్ళిపోయాడు.

రంగి లేచింది. తన అస్థిపంజరంలాంటి శరీరం మీదున్న చీరె రవికలాంటి గుడ్డ పేలికల్ని కొంచెం సర్దుకొంది. తైల సంస్కారం లేక కొబ్బరి పీచులా వున్న వెంట్రుకల్ని సవరించుకుంది. ఓ మూలనున్న సుత్తెను తీసుకుంది.

"రంగమ్మో... ఒసే రంగీ..." బయట్నించి ముత్తమ్మ కేక వినిపించింది. రంగి బయటకొచ్చింది.

"ఈరిగాడు యివ్వాళ నిన్ను తోలుకరమ్మన్నాడు. అత్తవా?" అంది ముత్తి.

"అత్తనే ఉన్న" అంది రంగి.

"పాణం బాగైందా?"

"పానం బాగయ్యేదాక కూకుంటె వెళ్తదా?"

"బో... గడిక తాగినవా!"

"ఆ! తాగిన."

వాళ్ళతోపాటు మరో ఐదారుగురు ఆడవాళ్ళు కలిసారు. అంతా బ్రిడ్జివైపు నడవసాగారు. అప్పటికే ఇంకో పదిమంది దాకా అక్కడచేరి కంకరాళ్ళనుతయారు చేస్తున్నారు.

రంగికి గుడిసెల దగ్గర్నుంచి బ్రిడ్జి దగ్గరకు నడిచేటప్పటికీ విపరీతమైన ఆయాసం వచ్చేసింది. ఈ రోజు ఎండ కూడా కొంచెం ఎక్కువగానే ఉన్నట్టుంది. రంగి ఇలాంటి ఎండలు ఎన్నో చూసింది ఇలాంటి ఎండల్లో పనిచేసింది. తన వంట్లో బాగాలేక ఈ రోజు ఎండకు భయపడాల్సి వచ్చింది రంగికి.

రంగి అందరితోపాటే రోడ్డుమీద కూర్చుని రాళ్ళను పగులగొట్టటం మొదలెట్టింది.

"ఆడన్నది నిజమే .. పంటూంటే పండ బుద్దయితది . గుడిసెల పన్నప్పుడు బ్రిడ్జిదాక నడుత్తననుకున్నానా . గిట్ల సత్తె ఎత్తుతననుకున్నానా . రాళ్ళను పగుల గొడ్తననుకున్నానా గప్పుడే తనదగ్గర కొంచెం కంకర తయారైంది."

రంగికి కొంచెం ధైర్యం కల్గింది. కొంచెం తృప్తి కల్గింది. తను మళ్ళీ పని చెయ్యగల్గుతోంది తను మళ్ళీ సంపాదించగల్గుతోంది. ఆడికి తనమీద కోపం పోతుంది. ఆడికి నిజానికి తనమీద అంత కోపమేమీ లేదు ఆడికి తనంటె కొంచెం 'ఇది' కూడా ఉంది

* * *

ఇరవై లక్షల ఖర్చుతో నిర్మించబడ్తున్న ఆ బ్రిడ్జి చకచకా తయారైపోతోంది. ఆ బ్రిడ్జిని ఆ జిల్లా కంతా పేరుమోసిన ఏవన్ కంట్రాక్టర్ జగన్మోహన్ రావు పట్టాడు. అతనికింద మరో ఐదారుగురు చిన్న కంట్రాక్టర్లు ఓ పది మంది దాకా మేస్త్రీలు పనిచేస్తారు. నాల్గో ప్రణాళికలో పథకాల్లో ఆ జిల్లాకు కేటాయించబడిన ముఖ్యమైన అభివృద్ధి పథకాల్లో ఆ బ్రిడ్జిని సాంక్షన్ చేయించటంలో ఆ జిల్లా నాయకులు, జగన్మోహన్ రావు, చీఫ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, సూపర్ వైజర్లు— అందరూ తమ తమ పరిధుల్లో సాధ్యమైనంతా చేశారు ఆ బ్రిడ్జి కట్టటంవల్ల ఆ జిల్లా స్వరూపమే ఎలా మారిపోతుందో, ఆ జిల్లాలో ఎంత బ్రహ్మాండమైన అభివృద్ధి జరుగుతుందో, బలహీన వర్గాల వాళ్ళకు ఆ బ్రిడ్జి కట్టటంవల్ల ఎంత లాభం చేకూరుతుందో వాళ్ళంతా ప్రభుత్వానికి నొక్కి చెప్పారు. వీళ్ళందరి ప్రయత్నాలవల్ల ఆ బ్రిడ్జి సాంక్షన్ కావటం, దాన్ని జగన్మోహనరావు చేపట్టటం, ఇరవై లక్షల రూపాయలు ఖర్చు కావటం, అందులో ఎవరెవరికి ఎంత వాటా చెందాలో నిర్ణయించటం— అన్నీ చకచకా జరిగిపోతున్నాయి.

ఆ బ్రిడ్జి సాంక్షన్ అయినందుకు సిమెంట్ వ్యాపారస్తులు సంతోషించారు. ఇనుము, ఉక్కు వ్యాపారస్తులు సంతోషించారు. విదేశాలనుండి దిగుమతి చేసుకోవాల్సిన సరుకుల విషయంలో విదేశ వ్యాపారం చేసే వాళ్ళూ సంతోషించారు తమకో ఐదారు నెలలపాటు పని దొరికింది కదా అని ఆ 60, 70 మంది కూలీలు సంతోషించారు.

ఎండ తీవ్రత ఇంకా ఎక్కువైంది. వడగాడ్పులు వీచటం మొదలెట్టాయి. భూనభోంతరాలు దద్దరిల్లిపోయేలా ప్రజ్వలిస్తున్నాడు సూర్యుడు. సమస్త జీవకోటి తమ తమ గూళ్ళను వదిలి బయటకు వచ్చే సాహసం చెయ్యలేకపోతున్నారు

కాని వాళ్ళు . ప్రకృతి శక్తుల్ని

జయించిన వాళ్ళు .. బండల్లాంటి శరీరాల వాళ్ళు .. వాళ్ళ ఘర్మబలంతో సమస్త విశ్వాన్ని ముంచెత్త గల్గిన వాళ్ళు . ప్రపంచంలో నేటివరకు తయారైన ఉత్పత్తి సాధనాల నన్నింటిని సృష్టించి సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగల్గిన వాళ్ళు.

వాళ్ళు ఆ ఎండకు భయపడటం కాదు, ఆ ఎండే వాళ్ళకు భయపడుతున్నదా అనిపిస్తోంది. వాళ్ళు వాళ్ళ నుదుటి చెమటతో ఆ ఎండలోని వేడిని శీతలంగా మార్చగల్గిన వాళ్ళు వాళ్ళు సామాన్యులు కారు

## 2

ఏవన్ కంట్రాక్టర్ జగన్మోహన్ రావు తన బంగళాముందు తళతళ మెరుస్తున్న అంబాసిడర్ కారు దిగి లోపలకెళ్ళాడు. గేటు దగ్గరున్న గూర్ఖా అత్యంత వినయంగా సాల్యూట్ చేశాడు.

జగన్మోహన్ రావుకు నలభై యేళ్ళుంటాయి కాని యాభై యేళ్ళవాడిలా కనిపిస్తాడు. అందుకు ముఖ్యమైన కారణం అతని బట్టతల. చాలా సింపుల్ గానే బుషర్ట్, పాంట్ వేసుకున్నాడు. కళ్ళకు గోల్డ్ ఫ్రేమ్ కళ్ళజోడు. నోట్లో ప్లేయర్స్ సిగరెట్. రావును చూడగానే వెంటనే స్ఫురించే భావం బాగా డబ్బున్న వాడని.

జగన్మోహన్ రావును గూర్చి అతని మిత్రులంతా బాగా కష్టపడి పైకొచ్చాడని చెప్తుంటారు రావు మొదట్లో ఓ మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. స్వాతంత్రోద్యమ కాలంలో రావు నూనూగు మీసాల ప్రాయంలో వున్నాడు. అందరూ 'భారత మాతాకిజై' అంటే అతడూ అన్నాడు. కాని సహజంగా కొంత చొరవ, నేర్పు, సాహసం గల రావు అంతటితోనే ఆగిపోలేదు. వాళ్ళ ఊరివోరమదన్ మోహన్ రెడ్డి ఆ జిల్లాలో కెల్లా పేరుమోసిన నాయకుడని తెలుసుకొని అతని పంచన చేరాడు 'కుర్రాడు చాకులా ఉన్నాడు పనికొస్తాడు' అనుకున్న రెడ్డిగారు రావును ప్రోత్సహించి తన ఆశ్రిత వర్గంలో ఒకన్నిగా చేర్చుకున్నాడు. రెడ్డి యేపని చెబితే ఆ పనిని న్యాయం అన్యాయం అని యోచించకుండా రావు తు చ తప్పకుండా చేశాడు. త్వరలోనే రావు రెడ్డికి 'నమ్మిన బంటు' అనే పేరు తెచ్చుకున్నాడు. ఇంతలోనే స్వాతంత్రియం వచ్చేసిందన్నారు.

స్వాతంత్రియంతో పాటు ఎన్నికలొచ్చాయి. ఎన్నికల్లో రెడ్డి పోటీ చేశాడు. రావు రాత్రింబవళ్లు నిద్రాహారాలు మానేసి రెడ్డికోసం ప్రచారం చేశాడు. రెడ్డి గెలిచాడు గెలవటమే

★ **అలెగ్జాండర్ ది గ్రేట్ మృతదేహాన్ని బాబిలోన్ నుంచీ అలెగ్జాండ్రియాకు నవరత్న ఖచితమైన పేటికలో ఉంచి, ఆ పేటికను 64 గుర్రాలతో లాగించుతూ కీకారణ్యాలలో వెయ్యి మైళ్ల దూరం తీసికెళ్లారు అలెగ్జాండర్ అంత్యక్రియలకు 480 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చయినదట! అబ్బ! ఎన్ని నాగార్జున సాగరులో!**

**—సేకరణ : 'జయ'**

కాదు మంత్రి కూడా అయ్యాడు. రావు ఎగిరి గంతేశాడు. రెడ్డి మంత్రి అయ్యాక రావును మరచిపోలేదు రావు శక్తి సామర్థ్యాలమీద రెడ్డికి మంచి నమ్మక మేర్పడింది రెడ్డి రావుకు మొదట్లో చిన్న చిన్న కంట్రాక్టులు ఇప్పించటం మొదలెట్టాడు చూస్తుండగానే రావు 'ఇంతింతై వటు డింతై'నట్టుగా పైకొచ్చే శాడు. అతని సంపాదన మొదటి పంచ వర్ష ప్రణాళికలో వందల్లో ఉంటే, రెండో పంచవర్ష ప్రణాళికలో వేలై, మూడో పంచవర్ష ప్రణాళిక నాటికి లక్షల్లో పడింది, నాల్గో పంచవర్ష ప్రణాళిక నాటికి అతడు రాష్ట్రమంతా ప్రఖ్యాతి వహించిన ఏవన్ కంట్రాక్టర్ గా స్థిరపడిపోయాడు.

జగన్మోహన్ రావు మూడో ప్రణాళిక లోనే ఆ పట్నంలోకల్లా అందమైన బిల్డింగ్ కట్టించాడు. రావుకు ముప్ఫయేళ్ళ ప్రాయంలో పెళ్ళయ్యింది. యాభై వేల దాకా కట్నమిచ్చి బాగా డబ్బున్న వాళ్ళు, పేరున్న వాళ్ళు అతనికి సుహాసిని నిచ్చి పెళ్ళిచేశారు

సుహాసిని బి. ఏ దాకా చదివింది. రావు తను బి. ఏ ప్యాసయ్యాడని చెప్పు కుంటాడు గానీ అతడు మెట్రిక్యులేషన్ కూడా పూర్తిచెయ్యలేదని చాలామందికి తెలుసు.

రావు కారు దిగి రెండో అంతస్తులో ఉన్న సుహాసిని గదిలోకి వెళ్ళాడు. సుహాసినికోసం ఆ గదిని ఈ మధ్యనే ఎయిర్ కండిషన్ చేయించాడు.

రావుకు సుహాసిని అంటే విపరీతమైన అభిమానం. ఆమెను పువ్వుల్లో పెట్టి పూజించాలనుకుంటాడు తను ఆమెకు తగిన భర్తను కానని, యేదో అదృష్టం వల్ల తనకామె భార్యగా లభించిందని అతనికెందుకో ఓ గాఢమైన అభిప్రాయం ఉంది వయస్సులో తను ఆమెకంటె చాలా పెద్దవాడు చదువు, సంస్కారం, సాంప్రదాయం విషయంలో కూడా ఆమే తనకంటె ఎక్కువ. తనలోని లోపాల నన్నింటిని డబ్బుతో పూడ్చివేయాలని అతని ప్రయత్నం

డోర్ తెరచుకొని రావు ఎయిర్ కండిషన్డ్ గదిలో కొచ్చాడు. లోపల సుహాసిని యేదో మ్యాగజిన్ తిరగే స్తోంది ఎయిర్ కండిషన్డ్ గదిలో ఉన్నా ఆమె ఎంతో అలసిపోయినట్టుగా ఉంది. వాడిపోయినట్టుగా ఉంది. సుహాసినికి ముప్ఫై యేళ్లుంటాయి. కాని ఇరవై యేళ్ళ యువతిలా కనిపిస్తుంది. సుహాసిని అందంగా ఉంటుంది. ఆకర్షణీయంగా ఉంటుంది. వెంట్రుక వత్తుకుపోతే కంది పోయేంత సుకుమారంగా ఉంటుంది. ఏ దేవలోకమో, నందనవనమో తప్ప భూలోకమంటె తెలీని అప్సరసలా ఉంటుంది ఏడంతస్తుల వంటి స్తంభపు మేడలో బందీ చెయ్యబడిన రాజ కుమార్తెలా ఉంటుంది.

“అబ్బ! నరకంలోంచి స్వర్గంలో కొచ్చినట్టుగా ఉంది బయట ఎంత వేడిగా ఉందనుకున్నావు. మైగాడ్ .. ఈ రోజు టెంపరేచర్ 130 దాటి ఉంటుంది” అన్నాడు రావు సోఫామీద కూర్చుంటూ.

తన శాంతిని, యేకాంతాన్ని భగ్నం చేసిన ఈ రాక్షసుడెవరా అన్నంత విసుగ్గా చూసింది సుహాసిని.

“ఎయిర్ కండిషన్డ్ రూమని పేరేగాని

ట్వింకిల్ ట్వింకిల్ ఫిల్మీస్టార్!

కామెడీల గారడీలు హమేషా
అల్లి చేసేది కాంప్లికేటెడ్ తమాషా
తెలుగు వాళ్ళల్లో పుట్టిన రెండో రామ
లింగడు
తెనాలిలో పుట్టినవాణ్ణి స్ఫురింపచేస్తాడు
అప్పుడప్పుడు
అచ్చులూ, హల్లులూ కలిపిన కొత్త
రకం పేరెడీ
అతనంత చేయగలిగే వాడున్నాడా—
అయితే ఏడీ?



—జి. యస్. సూరి

రెండు మూడు గంటలుండేటప్పటికి దీంట్లోను వేడిగానే ఉంటోంది. యే కాశ్మీర్‌కో, స్విట్జర్లాండ్‌కో వెళ్ళిపోవాల్సింది. ఈ సమ్మర్‌లో. . ఈసారి స్విట్జర్లాండ్ వెడదామంటె మీ కెప్పుడూ రోడ్లు, బ్రిడ్జీలు... ఈ గొడవలతోనే సరిపాయె ..'' విసుగ్గా అంది సుహాసిని.

చీటికి మాటికి అలా విసుక్కోవటం, చిరుకోపాన్ని నటించటం సుహాసినికి చాలా యిష్టం. ఆమె అలా తన అందమైన కనుబొమల్ని ముడిచి, బుంగమూతి పెట్టి విసుక్కున్నప్పుడల్లా రావుకు ఎంతో అందంగా కనిపిస్తుంది. ఆమె అలా విసుక్కోవటం రావుకు చాలా యిష్టం.

''సారీ డియర్ .. నెక్స్ట్ సమ్మర్‌కు స్విట్జర్లాండు తప్పకుండా తీసుకుపోతాను. ఈసారి ఈ బ్రిడ్జొకటి అడ్డమొచ్చింది. వర్కంతా వార్ ఫూటింగ్‌లో నడుస్తోంది. ఈ బ్రిడ్జిమీద మనకెంత మిగుల్తుందో తెలుసా? లక్ష పైగా ..''

సుహాసిని 'ఆ!' అంటూ నోరు తెరుస్తుందని రావు ఆశించాడు. కాని ఆమె మామూలుగా విసుగ్గా మొఖంపెట్టి 'మీ కెప్పుడూ లక్షల గొడవే. మరో లోకమే లేదు. ఓ సరదాలేదు సంబడమూలేదు. ఇంత ఎండల్లో ఈ దిక్కుమాలిన ఊళ్ళో ఉండకపోతే యే కాశ్మీర్‌కో తీసుకెళ్ళరాదూ. మా డాడీ, అయితే ప్రతీ సమ్మర్‌కు తీసుకెళ్ళేవాడు.''

రావు చిన్నబుచ్చుకున్నాడు. తనకు ఇంత డబ్బుండి కూడా సుహాసినిని తృప్తి పరచలేకపోతున్నాడు. ఈసారి ఎన్ని పనులున్నా సరే తప్పనిసరిగా స్విట్జర్లాండు తీసికెళ్ళాలి.

రావు ఫ్రిజ్ ఓపెన్ చేసి రెండు బీర్ బాటిల్స్ బయటకు తీశాడు. వాటిని ఓపెన్ చేసి రెండు గ్లాసుల్లో పోసి తనొకటి తీసుకొని సుహాసిని కొకటిచ్చాడు. సుహాసిని నెమ్మదిగా సిప్ చెయ్యసాగింది. అతడు ఒక్క గుక్కలో తాగేసి మళ్ళీ గ్లాసు నింపాడు.

''పోనీయ్ గానీ ఇవ్వాళ మన ప్రోగ్రాం

యేంచేశావు?" అన్నాడు రావు.

"ప్రోగ్రామేమిటి?" అందామె కను బొమలు ముడిచి విసుగ్గా.

"మనమీ రోజు బ్రిడ్జి చూడటానికి వెడదామనుకున్నాం గదా."

చాలా రోజులుగా రావు తన భార్యకు తన అండర్‌లో తయారౌతున్న ఆ 20 లక్షల బ్రిడ్జిని చూపెట్టాలని ముచ్చట పడుతున్నాడు తనకింద ఎంతమంది పని చేస్తున్నారో , తను ఎంత పెద్ద కంట్రాక్టరో తన భార్య ఆ బ్రిడ్జి చూస్తేగాని నమ్మదని అతనికో నమ్మకం కల్గింది. అందుకే పదిరోజులుగా ఆమెను ఎన్నో విధాల బతిమాలి ఈరోజు ఆమె తనతో బ్రిడ్జి చూడటానికి వచ్చేట్టుగా ఒప్పించాడు.

"ఏమో బాబు .. బ్రిడ్జి చూడటానికి రమ్మని నా ప్రాణాలు తోడేస్తున్నారు. ఇంత ఎండలో ఈ ఎయిర్‌కండిషన్డ్ రూమ్ బయటకొచ్చి నేను బతకగలనా?" అంది సుహాసిని గోముగా. రావు నవ్వాడు.

"ఇప్పుడు నాలుగౌతోంది. ఎండ చాలావరకు తగ్గిపోయింది. మన కార్లో జస్ట్ హాఫెనవర్ ప్రయాణం. అలా షికారుకు వెళ్ళినట్టుగా వెళ్ళి వచ్చేద్దాము. ఇచ్చిన మాట తప్పకూడదు దేవీ!" అతడు ఆమె దగ్గరగా వెళ్ళి ఆమె గదుమ పట్టుకున్నాడు

"ఆల్‌రైట్ బాబా .. వస్తాను. కొంచెం స్నానంచేసి డ్రెస్ మార్చుకోనీయ్. లక్షలు లక్షలంటారు. ఓ ఎయిర్ కండిషన్డ్ కారన్నా కొన్నారుకాదు. ఆ డొక్కు అంబాసిడర్ కారుతో నెట్టుకొస్తున్నారు."

"చాలా త్వరలోనే మనం 'ఇంపాలా' కారు కొనబోతున్నాము దేవీ! కొంచెం ఓపిక పట్టు వెధవది ఈ దేశంలో అన్నీ కంట్రోల్స్ నారాయె. మన డబ్బుతో మనం మన కిష్టమైన వస్తువులు కొనుక్కునే ఫ్రీడం లేదాయె. దేనికి పైరవీ, రికమెండేషన్ బోల్డు డిలే"

సుహాసిని స్నానం చెయ్యటానికి లేచింది.

"దేవిగారు తయారు కావటానికి ఎంత టైమ్ తీసుకుంటారో, చీకటి పడి పోదు గదా! బ్రిడ్జి దగ్గర మనుష్య సంచారం లేకుండా పోదు గదా" అన్నాడు రావు.

తన భార్యకు తన కింద ఎంతమంది కూలీలు పని చేస్తున్నారో చూపించాలని వాళ్ళంతా తనిచ్చే రెండు మూడు రూపాయల కోసం ఎలా రెక్కలు విరుచుకొని ఆ ఎండలో పనిచేస్తున్నారో చూపించాలని అతనికెంతో ఆతురతగా ఉంది.

"త్వరగానే వస్తాను లెండి" అంటూ సుహాసిని ఆ గదినుండి బయటకొచ్చి 'అబ్బ! ఎంత వేడిగా ఉంది బాబోయ్' అని కేకేసింది.

ఇద్దరు ముగ్గురు నౌకర్లు వచ్చి ఆమె ఆజ్ఞకోసం నిల్చున్నారు.

"స్నానం చెయ్యాలి త్వరగా" అందామె.

వాళ్ళంతా బాత్‌రూమ్‌వైపు పరుగెత్తారు. కావలసినవన్నీ చకాచకా అమర్చారు. సుహాసిని అద్దంలా మెరుస్తున్న ఆ బాత్‌రూంలోకి ప్రవేశించింది. అనేక సువాసనలతో, లిక్విడ్స్ వాసనలతో ఆ గది గుబాళిస్తోంది. పాల

రాతి చెక్కడాలతో తళతళ మెరిసి పోతున్నదా బాత్ రూమ్

ఓ అరగంటసేపు స్నానంచేసి బయట కొచ్చింది సుహాసిని మరో అరగంట సేపు నిలువుటద్దం ముందు కూర్చొని అలంకరించుకొని బయటకొచ్చి జగన్మోహన్ రావు పక్కన కార్లో కూర్చుంది రావు కారు స్టార్టు చేశాడు

ఎండ తీవ్రత యేమాత్రంకూడా తగ్గలేదు వడగాలి వీస్తూనే ఉంది.

"అబ్బ ఐదైనా ఇంకా ఎండ వేడిమి తగ్గనేలేదు మనం క్షేమంగా తిరిగి రాగలమంటారా? లేక మధ్యలో ఏ సన్ స్ట్రోకో వచ్చి పడిపోతామా?" అంది సుహాసిని.

"ఐదు దాటుతోంది ఇప్పుడేం సన్ స్ట్రోక్ లే ఒంటి గంట, రెండు గంటల ప్రాంతాల్లో ఉన్న ఎండ ఇప్పుడేం ఉంది లే మా కూలీలు చూడు అంత ఎండలో కూడా పనిచేస్తూనే ఉంటారు వాళ్ళకు రాని సన్ స్ట్రోక్ మన కొస్తుందా?"

"ఏమో బాబు .. ఈ వడగాడ్పు చూడండి. అప్పుడే సా నో రా రి పోతోంది. రానంటె మీకు కోపం వస్తుంది"

"నోరారిపోతుందా? జగ్ లో నీళ్ళున్నాయి, తాగుతావా?" అన్నాడు రావు ఆదుర్దాగా కారాపి గ్లాసులో మంచినీళ్ళు పోసి ఆమెకిచ్చాడు ఆమె మంచినీళ్ళు తాగి కొంచెం తేరుకుంది. ఆమె ముఖానికి పూసుకున్న క్రీమ్స్, వేసుకున్న పౌడర్స్ చెమటకు కరిగి పోతున్నాయి ఆమె తెల్లటి చెక్కిళ్ళు అప్పుడే కందిపోతున్నాయి ఐదారు మైళ్లుకూడా ప్రయాణం చెయ్యకుండానే అలా నీరుగారిపోయిన భార్యను చూస్తే రావుకు ఆశ్చర్యం, భయమూ కల్గాయి. ఈమెకు నిజంగానే సన్ స్ట్రోక్ వచ్చేట్టుంది అనుకున్నాడతడు.


# తెలుగు వారి దీపసాగరం

ఒకదీపం వెలిగింది
వేల వేల రైతుల గాదెల్లో
ధాన్య లక్ష్మి నిండింది.

## నాగార్జున సాగర్‌కింద 10 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌర సంబంధశాఖ, హైదరాబాదు—1.

"పోనీయ్ తిరిగి వెళ్ళిపోదామా?" అన్నాడు రావు

"ఫరవాలేదు లెండి ఎలాగూ బయ లేరాం గదా . నౌ ఐయామ్ ఆల్ రైట్ కారు పోనీయండి" అంది సుహాసిని.

రావు కారు స్టార్టు చేశాడు అతడు బాధ పడ్డాడని, అతన్ని ఉత్సాహ పరచాలని 'మీ కారు ఇంతకంటె వేగంగా పోదా బాబూ' అంది. అతడు ఆక్సిలేటర్ నొక్కాడు కారు 50 మైళ్ళ వేగాన్ని అందుకుంది. ఆమె కిలాకిలా నవ్వింది

' ఫరవాలేదే . అంబాసిడర్ కారు కూడా 50 మైళ్ళ స్పీడును అందుకో గలదన్న మాట "

అతడుకూడా నవ్వాడు. ఆమె సాధ్య మైనంత ఛీర్ ఫుల్ గా కనిపించటానికి ప్రయత్నించింది

కారు బ్రిడ్జిని సమీపించింది. బ్రిడ్జికి చాలా దగ్గరగా తీసుకవచ్చి ఆడవాళ్ళు రాళ్ళను పగులగొడ్తున్న చోట ఆపాడు రావు. వాళ్ళకేసి 'వీళ్ళూ మనుష్యు లేనా? అందులో ఆడవాళ్ళా?' అన్న ట్టుగా చూసింది సుహాసిని కారులో ఉన్న సుహాసినికేసి 'ఈమెకూడా మని షేనా' అన్నట్టుగా చూశారు ఆ రాళ్ళు పగులగొడ్తున్న ఆడవాళ్ళు.

కారు రావటం చూడగానే ఇద్దరు మేస్త్రీలు పరుగెత్తుకుంటూ వచ్చారు. వినయంగా నమస్కారం చేశారు

"ఏం లక్ష్మీపతి . వర్కు ఎంతవర కొచ్చింది?"

"అవుతూనే ఉంది గదండి. సరి పోయేంత ఇసిక, కంకర బ్రిడ్జిమీదకు చేరటమే ఆలస్యం."

"త్వరగా కానీయ్. అవసరమయితే ఇంకా ఎక్కువమంది కూలీలను పెట్టు."

"అయ్యా అలాగే "

కూలీలంతా ఆ రోజుకు పని ముగించు కొని వచ్చేస్తున్నారు అందరూ కారు కేసి, కారులో కూర్చున్న మనుష్యుల కేసి వాళ్ళేదో మరో గ్రహంనుండి వచ్చినవాళ్ళ మన్నట్టుగా చూశారు. అర్ధనగ్నంగా, చెమటలు కారుతున్న బండరాళ్ళల్లా ఉన్నవాళ్ళ శరీరాల్ని చూస్తోంటే సుహాసినికి తల తిరిగిన ట్టయింది ఆమెకు వాళ్ళేదో భయంకర మైన వింత జంతువుల్లా కనిపించారు వాళ్ళంతా రావుకు దండాలు పెడ్తూ కారుకు చాలా దగ్గరగా వచ్చారు. వాళ్ళ శరీరాల్నించి వెలువడిన చెమట వాసన సుహాసిని నాసికాపుటాల్ని బద్దలు చేసింది వాళ్ళందర్ని అంత దగ్గరగా చూసేటప్పటికి సుహాసినికి వాళ్ళంతా తననూ, తన భర్తను తినేస్తారేమో నన్నంత భయం కల్గింది ఆమె గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి కడుపులో తిప్పినట్టయింది గొంతు తడారిపోయింది, వాంతి వచ్చినట్టుగా ఫీలయ్యింది ఆమె విపరీతంగా వణికపోసాగింది. తనకేమో అవుతున్నది సందేహం లేదు తనకు సన్ స్ట్రోక్ తగిలింది

వాళ్ళంతా కారు చుట్టూ చేరి లోప లున్న సుహాసినికేసి కళ్ళప్పగించి చూడ సాగారు సుహాసిని వాళ్ళ చూపుల్ని భరించలేక పోయింది.

"ఏమండి నాకేదో అవుతోందండి, నా తల తిరిగిపోతోందండి" అంటూనే

సుహాసిని అతనిమీదకు వొరిగిపోయింది. రావుకు పై ప్రాణాలు పైనే లేచిపోయినట్లనిపించింది. సందేహం లేదు తన భార్యకు సన్‌స్ట్రోక్ తగిలింది జగన్మోహన్‌రావు భార్యను వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్ళాలని కారును పట్టణం వైపు మళ్ళిస్తుండగానే కంకరరాళ్ళు పగులగొడ్తున్న ఆడకూలీల్లో పెద్ద కలకలం పుట్టింది. రంగి రాళ్ళు కొడ్తున్నది కొడ్తున్నట్టుగానే నేల కొరిగిపోయింది. రంగి నోట్లో తడి లేదు. మొహంలో జీవం లేదు. అక్కడున్న కూలీలంతా రంగి చుట్టూ చేరారు

"వడదెబ్బ రంగికి వడదెబ్బ కొట్టింది పట్నం తోలుకపోయి దవఖాన్ల యేస్తే బతుకతది" అన్నారంతా.

ఈరిగాడు భార్యను చేతుల్లోకి తీసుకున్నాడు.

ఆ గొడవేమిటో జగన్మోహనరావు పట్టించుకో దల్చుకోలేదు తన భార్యకు యేదో అయ్యింది సన్‌స్ట్రోక్ తగిలింది. వెంటనే హాస్పిటల్‌కు చేర్చాలి క్షణం ఆలస్యమైనా తన భార్య తనకు దక్కదు రావు కారు వెనక్కి తిప్పుతున్నాడు

"అరే ఈరిగా, దొర కాళ్ళు బట్టుకోరా. కార్లో పట్నం తీస్కపోయి దవాఖాన్ల జేర్పిస్తడు" అన్నారు ఆ గుంపులో ఎవరో

ఈరిగాడు వెంటనే రావు కారుకు అడ్డంగా పరుగెత్తాడు

"దొరా! నా ఆడదానికి వడదెబ్బ కొట్టింది దొరా. దబ్బున దవాఖాన్ల జేర్పిత్తే బతుకతది. మీ కార్లో యేసుకు పోండ్రి దొరా మీ కాళ్ళు పట్టుకుంట దొరా. మీ బాంచను దొరా. పిల్లలు గలోన్ని దొరా. దాని వంట్లె బాగ లేకున్నా, నేనే దాన్ని యియ్యాల పనికి రమ్మన్న దొరా. పేదోళ్ళం. దయ దల్చండి దొరా"

ఈరిగాడు గుండెలు పగిలేలా యేడ్చాడు, బతిమాలాడు. కాని, రావుకు వాడు చెబ్తున్నదేమిటో అర్థం కాలేదు. వాడి భార్యను కార్లో తీసుకుపొమ్మనటం మట్టుకు తెలిసింది. అలాంటి మనుష్యులు తన కార్లో కూర్చోవటాన్ని అతడు ఊహించలేకపోయాడు. పైగా ఆ క్షణంలో అతడి బుర్రలో ఒకటే భావం. తన భార్య, తన ప్రాణం, తన సర్వస్వం సుహాసినికి సన్‌స్ట్రోక్ తగిలింది ఒక్క క్షణం ఆలస్యమైనా ఆమె ప్రాణాలు పోవచ్చు ఈరిగాడ్ని గట్టిగా కసురుకుంటూ కారు ముందుకు పోనిచ్చాడు రావు. కారు పట్నంవైపు 60 మైళ్ళ స్పీడుతో పరుగెత్తింది. కారు వెనకాల పరుగెత్తబోయిన ఈరిగాడి కళ్ళల్లో దుమ్ము, కన్నీటి తెర కలిసి అతని కాళ్ళకు బంధం వేశాయి

"అరే ఈరిగా, రంగి మనకిక దక్కదురా" అన్నారు అక్కడివాళ్ళంతా. ఈరిగాడు చావుబ్రతుకుల మధ్య ఊగిసలాడుతున్న రంగిని తన చేతుల్లోకి తీసుకున్నాడు అందరూ కలిసి రంగిని ఓ చెట్టు కిందికి చేర్చారు. ఏవేవో ఉపచారాలు చేశారు. నీళ్లు తెచ్చి మొఖంమీద చిలకరించారు. తడిగుడ్డలు మొఖంమీద, నెత్తిమీద కప్పారు. కానీ రంగిలో

చలనం లేదు.

* * *

జగన్మోహన్‌రావు కారు ఆ పట్నానికంతా పెద్దదైన 'సాయిబాబా నర్సింగ్ హోమ్' ముందు ఆగింది. రావును గుర్తుపట్టిన ఇద్దరు నర్సులు కారు దగ్గరకు పరుగెత్తుకుంటూ వచ్చి సుహాసినిని వెంటనే ఎయిర్‌కండిషన్డ్ రూమ్‌లో చేర్చారు. డాక్టర్ రమణారావుకు ఈ వార్త తెలియగానే చూస్తున్న పేషంటును వదిలేసి సుహాసిని దగ్గరకు పరుగెత్తాడు.

"ఏమీ ప్రమాదం లేదు గదా డాక్టర్?" అన్నాడు రావు

సుహాసినిని పరీక్ష చేసిన డాక్టర్ చిరునవ్వు నవ్వాడు.

"ఇట్స్ నథింగ్. ఎండలో ప్రయాణం చేశారేమో, కొంచెం అలసిపోయినట్టుగా ఉంది దట్సాల్" అన్నాడు డాక్టర్.

"సన్ స్ట్రోక్ కాదంటారా?" అన్నాడు రావు

సుహాసిని కళ్ళు తెరిచింది పొరపాటున తప్పిపోయి తనకు తెలియని ఏదో పాడు ప్రపంచంలో పడిపోయి మళ్ళీ తన మామూలు ప్రపంచంలో కొచ్చాననిపించిందామెకు

"ఎలా ఉంది డియర్ ఆర్ యూ ఆల్‌రైట్" ఆదుర్దాగా అడిగాడు రావు.

సుహాసిని భర్తకేసి చూస్తూ చిరునవ్వు నవ్వింది.

"సారీ డియర్. ఈ ఎండాకాలం వెళ్ళేదాకా నిన్ను ఎయిర్ కండిషన్డ్ రూమ్‌నుండి బయటకు తీసుకెళ్ళను. వెరీ వెరీ సారీ డియర్" అన్నాడు రావు.

"అబ్బ .. మీరు కాస్సేపు ఊరుకొందురూ" అందామె విసుగ్గా

"నువ్విలా విసుక్కుంటే ఎంత అందంగా ఉంటావో తెలుసా?" అన్నాడు రావు

"ఊరుకోండంటే మీ కాదు"

ఆమె మళ్ళీ విసుక్కుంది

అతడు హాయిగా నవ్వాడు.

* * *

తెల్లారి పొద్దున్నే ఆరోజు పేపరు తిరగేస్తుంటే జగన్మోహన్‌రావును ఓ వార్త ఆకర్షించింది. 'కరీంనగర్ జిల్లాలో మానేరు నదిమీద నిర్మిస్తున్న బ్రిడ్జిదగ్గర పనిచేస్తున్న ఓ స్త్రీ నిన్న వడదెబ్బ తాకి చనిపోయింది. దీనితో కరీంనగర్ జిల్లాలో వడదెబ్బ తాకి చనిపోయినవారి సంఖ్య 15 కు పెరిగింది" అదీ ఆ వార్త. నిన్న బ్రిడ్జిదగ్గర పనిచేస్తున్న ఆడవాళ్ళల్లో కలకలం. వాడెవడో తన కారుకు అడ్డంగా రావటం, తన భార్యను కార్లో తీసుకు పొమ్మనటం, రావు కళ్ళ ముందు మెదిలింది. వాడన్నట్టు వాడి భార్యను తన కార్లో తీసుకువచ్చి హాస్పిటల్లో జాయిన్ చేయించివుంటే బ్రతికి వుండేదేమో నన్న భావం రావు బుర్రలో క్షణంసేపు మెదిలింది కానీ వెంటనే_

"ప్చ్ .. ఇలాంటివి జరుగుతూనే వుంటాయి. మనమేం ఆపగలం" అనుకుంటూ పేపర్లోని ఇతర వార్తలమీదకు తన దృష్టిని పోనిచ్చాడు యేవన్ కంట్రాక్టర్ జగన్మోహన్‌రావు. *